క్లుప్తంగా

దళితులకు చట్టాలపై అవగాహన

యాదమరి: దళితులు తమ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ పార్థసారథి అన్నారు. మండలంలోని దాసరాపల్లిలో శుక్రవారం దళితులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో దళితులకు ప్రత్యేక హక్కులను కల్పించిందని అన్నారు. ఎంపీడీవో వేణు మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న పలు సంక్షేమ పథకాలను దళితులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఉపాధి హామీ పథకంలో పనిలో నాణ్యతా చూపిస్తే కనీస వేతనం తప్పక లభిస్తుందని ఏపీఓ సంధ్యారాణి దళితులకు వివరించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు రవి,హెన్రీ, థామస్ గ్రామస్తులు పాల్గొన్నారు.

దోమకాటు ఆరోగ్యానికి చేటు

గుడిపాల: దోమకాటు ఆరోగ్యానికి చేటు అని బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి రష్మిత అన్నారు. మండలంలోని బొమ్మసముద్రంలో శుక్రవారం వైద్యాధికారి ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన, డ్రైడే ఫ్రైడే, కిశోర బాలికలు తీసుకోవలసి జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలకు దోమల వల్ల వ్యాపించే వ్యాధుల గురించి, వాటి నివారణ చర్యలను తెలియజేశారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కిశోర బాలికల్లో కౌమార దశలో వచ్చే మార్పులు, తీసుకోవల్సిన జాగ్రత్తలపై వారికి వివరించారు. పౌష్టికాహారం వల్ల కలిగే లాభాల గురించి తెలపడంతోపాటు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి వారికి విపులంగా వివరించారు.

పొగాకు వ్యతిరేక దినోత్సవంపై అవగాహన నేడు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని టెలిఫోన్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎంహెచ్ఓ సుధారాణి తెలిపారు. ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అధికారులు, సిబ్బంది హాజరు కావాలని ఆమె పేర్కొన్నారు.

బడుల బలోపేతానికి కృషి చేయాలి


హెచ్ఎంలకు ఫైల్‌ను బహూకరిస్తున్న బాలాజి

చిత్తూరు కలెక్టరేట్: స్కూల్ అసిస్టెంట్ కేడర్ నుంచి గ్రేడ్-2 హెచ్ఎంలుగా ఉద్యోగోన్నతి పొందిన హెచ్ఎంలు సర్కారు బడుల బలోపేతానికి కృషి చేయాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఉద్యోగోన్నతి పొందిన హెచ్ఎంలకు ఆ సంఘం నాయకులు ఫైల్‌ను బహూకరించారు. కార్యక్రమంలో ఆ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు నాగరాజు, ప్రధాన కార్యదర్శి సాంబిరెడ్డి, చిత్తూరు జిల్లా అధ్యక్షులు మంజునాథగుప్తా, ఉపాధ్యక్షులు గిరిబాబు, జిల్లా నాయకులు సురేష్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గుడిపాల: వాతావరణ మార్పుల వల్ల వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రష్మిత తెలిపారు. చింతగుంటూరు గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. బీపీ, షుగర్, గర్భవతులకు చికిత్సలు చేసి ఉచితంగా మందులు, మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది కలైవాణి, ప్రియాంక, సుజాత, ప్రవీణ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలి

తవణంపల్లె: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచి వ్యాధులకు దూరంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని ఎగువ మారేడుపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 34 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు మంచి పౌష్టికాహారం భుజించాలన్నారు. రక్తహీనత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కుంభాభిషేక మహోత్సవం


కలశం, స్వామి చిత్రపటంతో ఊరేగింపుగా వస్తున్న వేదపండితులు, అధికారులు, భక్తులు


ఆలయంలో ఆకట్టుకుంటున్న ప్రత్యేక పుష్పాలంకరణ

కాణిపాకంలోని శ్రీ వీరాంజనేయ స్వామి వారి ఆలయ మహా కుంభాభిషేక మహోత్సవం శుక్రవారం శాస్త్రోక్తంగా సాగింది. ఆలయంలో పుష్పాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయ పునర్నిర్మాణానంతరం నిర్వహించిన ఈ కుంభాభిషేకంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో పెంచల కిషోర్, దేవస్థానం మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. – కాణిపాకం

కక్ష గట్టి.. ఎఫ్ఏలను తరిమికొట్టి


తవణంపల్లె మండలంలో పూడికతీత పనులు చేపడుతున్న కూలీలు


ఐరాల మండలంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపాధి సిబ్బందిపై జులుం విసిరింది. తమ పార్టీ వారిని నియమించుకోవడానికి ఫీల్డ్ అసిస్టెంట్లను బలవంతంగా తొలగించింది. రాజీనామా చేయని వారిని బెదిరించి, వేధించి, దాడి చేసి తరిమికొట్టింది. ఆ స్థానాల్లో టీడీపీ వారిని నియమించుకుంది. ఆ తరువాత ఉపాధి కూలీలందరికీ పనులు చూపించడంలేదు. కేవలం కొందరికి పనులకు కల్పించింది. వారికి కూడా వేతనాలు సకాలంలో ఇవ్వకుండా కూలీలు పస్తులతో అల్లాడిపోతున్నా పట్టించుకోకపోవడం గమనార్హం.

- 35 మంది క్షేత్ర సహాయకుల తొలగింపు
- నెలల తరబడి అందని కూలీల వేతనాలు
- ఉపాధి సిబ్బందికి జీతాలు చెల్లింపులో జాప్యం

తవణంపల్లె: కూటమి ప్రభుత్వంలో ఉపాధి కూలీలకు ఆకలి కేకలు మొదలయ్యాయి. గత ప్రభుత్వంలో చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గంలో కూలీలచే విరివిగా పనులు చేపట్టారు. పనులు చేసిన వారికి ప్రతి వారం సకాలంలో వేతనాలు చెల్లించింది. ఈ కూటమి ప్రభుత్వం ఉపాధి పనులకు వెళ్లిన కూలీల కడుపుమాడ్చుతోంది. దీంతో ఉపాధి పనులకు కూలీలు ముందుకు రావడంలేదు. పస్తులతో చేసిన పనుల బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారని వేతన జీవులు ఎదురుచూస్తున్నారు. ఫలితంగా ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది.

ఫీల్డు అసిస్టెంట్లపై కక్ష

ఉపాధి పథకంలో పనిచేస్తున్న క్షేత్ర సహాయకులను కూటమి సర్కారు కక్షకట్టింది. ఏళ్ల తరబడి ఉపాధిలో పని చేస్తున్న ఫీల్డు అసిస్టెంట్లను బలవంతంగా రాజీనామా చేయించి, తొలగించింది. కొంతమంది రాజీనామా చేయడానికి నిరాకరించడంతో వారిపై కేసులు పెట్టి, వారి ఆస్తులు ధ్వంసం చేసి భయభ్రాంతులకు గురిచేసింది. అలా 35 మంది క్షేత్ర సహాయకులను తరిమికొట్టి వారి కుటుంబాలు రోడ్డున పడేసింది. చిత్తూరు మండలంలో ఐదుగురు, గుడిపాల మండలంలో ఆరుగురు, పూతలపట్టులో 9 మంది, బంగారుపాళ్యం మండలంలో 9 మంది, ఐరాల మండలంలో ఇద్దరిని, యాదమరి మండలంలో నలుగురు ఫీల్డు అసిస్టెంట్లను తొలగించారు. వీరి స్థానంలో కూటమి నాయకులు వారికి అనుకూలంగా ఉండే వారిని నియమించుకున్నారు.

వేతనాలు అందక తగ్గిన కూలీల సంఖ్య

చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో ఉపాధి పథకం కింద పనులు చేసిన కూలీలకు నెలల తరబడి అందలేదు. దీంతో వారు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి పాలనలో కూలీలకు సక్రమంగా బిల్లులు అందడంలేదని వేతనజీవులు మండిపడుతున్నారు. వేతనాలు ఇవ్వక కూలీల కడుపు మాడ్చేస్తే ఎలాగని ఆగ్రహిస్తున్నారు. వేతనాలు సకాలంలో చెల్లించకపోవడంతో కూలీల సంఖ్య తగ్గుముఖం పట్టింది. ఫలితంగా ఉపాధి పనుల లక్ష్యాన్ని సాధించలేక సిబ్బంది అవస్థలు పడుతున్నారు.

క్షేత్ర సహాయకుల స్థానంలో మేట్లు

గ్రామస్థాయిలో ఉపాధి పనులు చేపట్టాలంటే క్షేత్ర సహాయకులే కీలకం. తవణంపల్లె మండలంలో 32 మంది ఫీల్డు అసిస్టెంట్లకు 20 మంది పని చేస్తున్నారు. 12 పోస్టులు ఖాళీలు ఉన్నాయి. ఐరాల మండలంలో ఆరుగురు ఎఫ్ఏలు ఖాళీగా ఉన్నాయి. బంగారుపాళ్యం మండలంలో 11 ఖాళీలు, పూతలపట్టులో 11, చిత్తూరు మండలంలో 5 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ స్థానాల్లో కూటమి నాయకులు చెప్పిన వారిని మేట్లుగా నియమించారు.

మా కడుపుకొట్టిన కూటమి ప్రభుత్వం



నేను 2016లో ఉపాధి హామీ పథకం కింద ఫీల్డ్ అసిస్టెంట్‌గా చేరాను. ఎన్నికల వరకు నిరంతరాయంగా విధులు నిర్వర్తించాను. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే మాపై కక్షకట్టి తొలగించింది. మా కుటుంబాలు వీధినపడ్డాయి. తొలగించిన ఫీల్డు అసిస్టెంట్ల స్థానంలో మేట్లను నియమించడం దారుణం.

–వేణు, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్, కేఎం కండ్రిగ, బంగారుపాళ్యం

రెండు నెలలుగా వేతనాలు చెల్లించలేదు



ఉపాధి పథకం కింద పనులు చేశాం. రెండు నెలలుగా కూలీలకు వేతనాలు చెల్లించలేదు. దీని వల్ల చాలా ఇబ్బందిపడుతున్నాం. ఇప్పటికైనా కూలీలకు వేతనాలు చెల్లించాలి. వారానికోసారి బిల్లులు ఇస్తామని నెలలు తరబడి ఇవ్వకపోవడం దారుణం.

– గోపాల్‌రెడ్డి, టి.పుత్తూరు

ఎందుకంత చిన్నచూపు



కుటుంబపోషణ కోసం ఉపాధి పథకం కింద పనులు చేయడానికి వెళ్లాం. ఈ కూటమి ప్రభుత్వం కూలీలకు బిల్లులు చెల్లించకుండా ఎందుకు చిన్నచూపు చూస్తున్నారు. వారానికి ఒక సారి బిల్లులు ఇస్తామని కూలీల కడుపుకోత కోయడం మంచిదికాదు.

–రాజేంద్ర, ఉపాధి కూలీ, యాదమరి

సకాలంలో బిల్లులు ఇవ్వడం లేదు



గత ప్రభుత్వంలో కూలీలకు ఉపాధి బిల్లులు సకాలంలో అందించారు. కూటమి ప్రభుత్వంలో కూలీలకు కష్టాలు మొదలయ్యాయి. బిల్లులు చెల్లించడంపై దృష్టి పెట్టడం లేదు. ప్రభుత్వం కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించాలి.

–అమరనాథ్, ఉపాధి కూలీ, రంగమ్మచెరువు

మొగిలీశ్వర స్వామికి రూ.3.69 లక్షల ఆదాయం

బంగారుపాళెం: మండలంలోని మొగిలీశ్వర స్వామి వారి హుండీ ద్వారా రూ.3,69,355 ఆదాయం వచ్చినట్లు ఈఓ మునిరాజు తెలిపారు. దేవాలయం ఆవరణలో శుక్రవారం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని దేవదాయశాఖ చిత్తూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ సుమనప్రియ పర్యవేక్షణలో చేపట్టారు. ఆలయంలో ఏర్పాటు చేసిన సాధారణ, అన్నదాన హుండీలకు సంబంధించి లెక్కింపు చేపట్టినట్లు తెలిపారు. 83 రోజులకు గాను సాధారణ హుండీల ద్వారా రూ.3,05,253, అన్నదాన హుండీ ద్వారా రూ.64,102 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

ఆదాయ సముపార్జనలో మహిళలే కీలకం


పత్రాలు అందజేస్తున్న పీడీ

యాదమరి: కుటుంబ ఆదాయ సముపార్జనలో మహిళలే కీలకం అని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి అన్నారు. ఆమె శుక్రవారం మండల వెలుగు కార్యాలయంలో మాట్లాడారు. మహిళలు ఆదాయ మార్గాలను అన్వేషించి అందులో అవకాశాలను ఒడిసి పట్టుకోవాలని చెప్పారు. అనంతరం మగ్గం వర్క్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 40 మందికి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్, డీపీఎం మధు, ఏపీఎం ఈశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

1 నుంచి మలేరియా నివారణ మాసోత్సవాలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మలేరియా నివారణ మాసోత్సవాలను జూన్ 1వతేది నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ పేర్కొన్నారు. చిత్తూరు నగరం జానకారపల్లెలో శుక్రవారం ఫ్రైడే..డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు మాసోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

చిత్తూరులో కుండపోత



చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో శుక్రవారం రాత్రి కుండపోత కురిసింది. రాత్రి 8 గంటల సమయంలో ప్రారంభమైన వర్షం 8.45 గంటలకు జోరుగా కురిసింది. ఈ వర్షానికి రోడ్లంతా జలమయమయ్యాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈదురు గాలులు లేకుండా నిలకడగా కురిసిన వర్షంతో మామిడి రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

మామిడి రైతులకు ఎర బుట్టలు సరఫరా


పండు ఈగ నివారణకు తోటలో కట్టిన ఎర బుట్ట

ఐరాల: మామిడి రైతులకు పండు ఈగ ఎర బుట్టలు రాయితీపై ఉద్యాన శాఖ ద్వారా సరఫరా చేయనున్నట్లు మండల ఉద్యాన శాఖాధికారి సాగరిక తెలిపారు. స్థానిక ఆర్‌ఎస్‌కేలో శుక్రవారం హెచ్ఓ మాట్లాడుతూ బంగారుపాళెం, తవణంపల్లె, ఐరాల మండలాల్లోని మామిడి రైతులకు సోమవారం బంగారుపాళెం తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న ఉద్యానవన శాఖాధికారి కార్యాలయం(రైతు సేవా కేంద్రం)లో పండు ఈగ ఎర బుట్టలు అందజేస్తామని చెప్పారు. వర్షాలు ముందుగా కురుస్తుండడంతో ఇప్పటికే పండు ఈగ మామిడి తోటల్లో చొరబడిందని పేర్కొన్నారు. పండు ఈగ వల్ల వాటిల్లే నష్టాన్ని నివారించడానికి ఒక బుట్ట సబ్సిడీ పోను రూ.11 రైతులకు అందిస్తామన్నారు. ఎకరాకు 8 బుట్టలు, రెండున్నర ఎకరాకు 20 బుట్టలు, ప్రతి రైతుకు గరిష్టంగా 40 బుట్టల వరకు అందజేయనున్నట్లు చెప్పారు. అవసరమైన మామిడి రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని రావాలని వివరించారు.

కూటమి సర్కార్ ‘వెన్నుపోటు దినం’



రూరల్ మండల నాయకులతో మాట్లాడుతున్న విజయానందరెడ్డి, కార్యక్రమంలో పాల్గొన్న గుడిపాల మండల నాయకులు

- 4న చిత్తూరు కలెక్టరేట్ వద్దకు ర్యాలీ
- పార్టీ కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలి
- వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి పిలుపు

చిత్తూరు కార్పొరేషన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి జూన్ నెల 4వ తేదీకి ఏడాది అవుతుందని, అదే రోజు ‘వెన్నుపోటు దినం’ పేరుతో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఆ పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో గుడిపాల, రూరల్ మండలాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బుధవారం స్థానిక పీవీకేఎన్ డిగ్రీ కళాశాల నుంచి ర్యాలీగా కలెక్టరేట్ వద్దకు చేరుకుంటామన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. ఏడాది పాలనలో టీడీపీ అధినేత చంద్రబాబు అన్ని వర్గాలను మోసం చేశారన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకపోతే చొక్కా పట్టుకోవాలని ఎన్నికల సమయంలో నారా లోకేష్ అన్నారని, ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ప్రతి పంచాయతీ నుంచి కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గుడిపాల మండల అధ్యక్షుడు ప్రకాష్, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి నాయకులు జనార్ధన్, మధుసూదన్, రజనీకాంత్, కలైఅరసి, రవీంద్రరెడ్డి, సుధాకర్ , చిత్తూరు రూరల్ మండల అధ్యక్షుడు జయపాల్, జెడ్పీటీసీ బాబునాయుడు, ఎంపీటీసీ ప్రతిమారెడ్డి, నాయకులు త్యాగ, భాస్కర్, కుమార్, రాజేంద్ర, స్టాండ్లీ పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

• కాణిపాకం: శ్రీవరసిద్ధి వినాయక స్వామిని శుక్రవారం మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి రాజేంద్ర కుమార్ వాణి దర్శించుకున్నారు.

అహిల్యాబాయి హోల్కర్ జయంతి


సమావేశంలో మాట్లాడుతున్న చిట్టిబాబు

గుడిపాల: మరాఠా రాణి అహిల్యాబాయి హోల్కర్ జయంతిని మండలంలోని వెప్పాల మానుచేను గ్రామంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా బీజేపీ సీనియర్ నాయకులు కొల్లా చిట్టిబాబు మాట్లాడుతూ అహిల్యాబాయి 1766 కాలంలో ఇండోర్ రాజ్యంలో ప్రజా రంజకమైన పాలన సాగించిందన్నారు. మహిళాభివృద్ధికి అవిశ్రాంతంగా కృషి చేసి పాడి, వస్త్ర పరిశ్రమను ప్రోత్సహిస్తూ మహిళలకు ఉపాధి కల్పించిందని చెప్పారు. ఆమె పాలనలో బద్రినాథ్, కేదార్‌నాథ్, సోమనాథ్, పూరి, రామేశ్వరం లాంటి దేవాలయాలతోపాటు 9,527 ఆలయాలను నిర్మించి, 36 అనాథ శరణాలయాలను ఏర్పాటు చేసిందన్నారు. మహిళలపై గౌరవంతో, రైతుల్లో సంతృప్తితో పారిశ్రామిక అభివృద్ధితో జరిగిన ఆమె పాలనను గుర్తుకు తెచ్చుకుంటూ 300వ జయంతి కార్యక్రమాన్ని వెప్పాలమానుచేను గ్రామంలో 100మంది మహిళల మధ్య జరుపుకొని, ఓంశక్తి ఆలయంలో హారతిని వెలిగించి అహిల్యాబాయికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సోమనాథ్‌గౌడ్, బ్రహ్మానందరెడ్డి, రామభద్ర, శోభన్‌బాబు, దేవరాజ్, చంద్రన్, రెడ్డి మస్తాన్ పాల్గొన్నారు.